


రీజనల్ విజిలెన్స్ ఎస్పిగా సురేష్‌బాబు



ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం రీజనల్ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పిగా ఎ.సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అవినీతి నిరోధక శాఖలో అదనపు ఎస్పిగా గుంటూరులో చేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడ విధుల్లో చేరారు. విజిలెన్స్ డిఎస్పి కిరణ్ కుమార్, డిఇ సత్యనారాయణ, ఎజి సురేష్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, సింహాచలం తదితరులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు అండగా...

- విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరు
- శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు వైజ్ఞానిక తరగతుల నిర్వహణ
- సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం
- నేడు శ్రీకాకుళంలో 41వ మహాసభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అధ్యయనం... పోరాటం నినాదంతో విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ 41వ మహాసభ నిర్వహణకు సిద్ధమైంది. శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వేదికగా నిర్వహించనున్న సభకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ హాజరు కానున్నారు. గడిచిన కాలంలో విద్యారంగ సమస్యలతో పాటు విద్యారంగానికి నష్టదాయకమైన నూతన విద్యా విధానంపై అలుపెరుగని పోరాటం చేస్తోంది. వీటితోపాటు పాఠశాలల స్థాయి నుంచి యూనివర్సిటీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిరంతరం పోరాటం చేస్తోంది. ఏడాది కాలంలో సాగించిన పోరాటాలను సమీక్షించుకుని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు సిద్ధమవుతోంది.



విద్యారంగంలో వస్తున్న మార్పులు, తరగతులను విలీనం చేసి విద్యార్థులను చదువుకు దూరం చేసే జిఒ నంబరు 172 రద్దు చేయాలని జులై 25న పలాస నుంచి హిందూపురం వరకు నిర్వహించిన బస్సు యాత్రలో జిల్లాకు చెందిన ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. ఆగస్టు 1, 23 తేదీల్లో విద్యారంగంలో సమస్యలపై ధర్నా, బంద్ చేపట్టారు. వీటితో పాటు విద్యార్థుల సమస్యలపై పలు పోరాటాలు చేపట్టారు.

వైజ్ఞానిక తరగతుల నిర్వహణ

విద్యార్థుల సమస్యలపై పోరాటంతో పాటు వారి విజ్ఞాన, మనోవికాసానికి ఎస్ఎఫ్ఐ దోహదపడింది. విద్యార్థులకు సమకాలీన అంశాలపై రోజూ స్టడీ సర్కిల్‌ను నిర్వహించింది. సమాజంపై, శాస్త్రీయ ఆలోచనపై అవగాహన పెంపొందించే దిశలో నిపుణులతో బోధనా తరగతులు నిర్వహించింది. సెప్టెంబర్ 17వ తేదీన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై, శాస్త్రీయ ఆలోచన విధానంపై టెక్కలిలో విద్యా సదస్సు నిర్వహించారు. ఈనెల 6, 7 తేదీల్లో విద్యా, వైజ్ఞానిక తరగతులు నిర్వహించారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం

ఎస్ఎఫ్ఐ పోరాటాలకే పరిమితం కాలేదు. అనేక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యమైంది. జులై 4వ తేదీన అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా 30 మంది విద్యార్థినులతో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రక్తదానం నిర్వహించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టెక్కలిలో పోలీసులతో కలిపి రక్తదాన శిబిరం నిర్వహించారు. మురికివాడలో ఉండే పేదలకు ఆహారం పంపిణీ చేసింది. నవంబర్ మూడో తేదీన ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో 400 విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి 11 మంది విద్యార్థులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరితే, మూడు రోజుల పాటు వాళ్లతో ఉండి వాళ్లకు కావాల్సినవన్నీ అందుబాటులో ఉంచి అవసరమైన సాయం అందించింది.

శ్రీకాకుళంలో నేడు ర్యాలీ, సభ

మహాసభ సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి నుంచి కోడి రామ్మూర్తి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం బహిరంగ నిర్వహించనున్నారు. మహాసభలకు పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.హరీష్, సిహెచ్.రాజు కోరారు.

టిడిపి నాయకుల అడ్డగింత

కూన రవితో పాటు పలువురు అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



ర్యాలీగా వెళ్తున్న టిడిపి నాయకులు

బిసిల సమస్యలపై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో పాటు నాయకులు స్థానిక టిడిపి కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు బుధవారం బయలుదేరారు. టిడిపి నాయకులు వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు కలెక్టరేట్ గేటు మూసేశారు. అనుమతి లేదంటూ లోపలకు పంపించకపోవడంతో టిడిపి నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అక్కడ కొంత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో కలెక్టరేట్ గేటు వద్ద నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన టిడిపి నాయకులు పోలీసులు అరెస్టు చేసి, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు.

వైసిపి ప్రభుత్వంలో బిసిలు తీవ్ర అణచివేతకు గురవుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ విమర్శించారు. జగన్ ప్రభుత్వం బిసిలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. ఏ ముఖం పెట్టుకుని బిసి గర్జన నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. బిసిలను చిన్నచూపు చూస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ బిసిల సంక్షేమం కోసం టిడిపి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేయగా, వైసిపి ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. సమావేశంలో నాయకులు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, సింతు సుధాకర్, ఉంగటి రమణ, పి.ఎం.జె బాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

బడి బయట పిల్లల కోసం సీజనల్ వసతిగృహాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వసతిగృహాల నిర్వహణపై విద్యాశాఖ అధికారులు, ఎన్‌జిఒలతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. బూర్జ మండలంలో నాలుగు వసతిగృహాలు నిర్వహించడానికి కారణాలు, విద్యార్థులు అందుబాటులో ఉన్నదీ లేనిదీ అడిగి ఆరా తీశారు. జిల్లాలోని ఎస్‌సి, బిసి వసతిగృహాల్లో చేర్పించేందుకు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఈ సమయంలో కొంతమంది తల్లిదండ్రులు వలసలు వెళ్లడమే ఇందుకు కారణమని ఎన్‌జిఒ ప్రతినిధి బదులిచ్చారు. గతేడాది నిర్వహించిన సీజనల్ వసతిగృహాలపై డాక్యుమెంటేషన్‌ను తయారు చేసి అందజేయాలని సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్‌ను ఆదేశించారు. మండలాల్లో సర్వే చేపట్టి ఏ మండలంలో ఎక్కువ వలసలు వెళ్తున్నారో గుర్తించి అక్కడ సీజనల్ వసతిగృహాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, బిసి సంక్షేమ అధికారి ఆర్.గడ్డెమ్మ, పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



చిలకపాలెం టోల్‌ప్లాజా ఎత్తివేత

- నేటి నుంచి నిలిచిపోనున్న వసూళ్లు
- ఉత్తర్వులు జారీ చేసిన ఎన్‌హెచ్ఎఐ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

టోల్ భారంతో సతమతమవుతున్న వాహనదారులకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ) తీపి కబురు అందించింది. మండలంలోని చిలకపాలెం వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాను బుధవారం అర్ధరాత్రి నుంచి ఎత్తివేస్తున్నారు. ఇకపై ఇక్కడ టోల్ వసూళ్లను నిలిపివేయనున్నారు. ఈమేరకు ఎన్‌హెచ్ఎఐ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 180 కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారి ఉంది. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం, నరసన్నపేట మండలం మడపాం, పలాస మండలం లక్ష్మీపురంలో టోల్‌ప్లాజాలు ఉన్నాయి. జాతీయ రహదారిపై 60 కిలోమీటర్లకు ఒక టోల్‌ప్లాజా ఉండాల్సి ఉండగా, నరసన్నపేట మండలంలోని మడపాం నుంచి చిలకపాలెం మధ్య 30 కిలోమీటర్లకే ఉంది. మడపాం, విజయనగరం జిల్లా నాతవలస మధ్యలో ఉన్న చిలకపాలెం టోల్‌ప్లాజా ఉండడంతో వాహనదారులపై టోల్ భారం పడుతోంది. దీనిపై వ్యతిరేకత వ్యక్తం కావడంతో పాటు చిలకపాలెం టోల్‌ప్లాజాను ఎత్తివేయాలని కోరుతూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందాయి. 60 కిలోమీటర్ల లోపు ఉన్న టోల్‌ప్లాజాలను ఎత్తివేయనున్నట్లు కొన్నాళ్ల కిందట కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. తాజాగా ఆ నిర్ణయం అమల్లోకి రావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డున పడనున్న ఉద్యోగులు

చిలకపాలెం టోల్‌ప్లాజా ఎత్తివేస్తుండడంతో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. తమను మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈమేరకు ఇప్పటికే వారు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్‌హెచ్ఎఐ అధికారులను కలిసి తమను ఉద్యోగాల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు, రేపు ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు

శ్రీకాకుళం : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు (శారీరక వైకల్యం, వినికిడి లోపం, చలన వైకల్య లోపం) డివిజన్ స్థాయిలో వైద్య పరీక్షలు చేసి, ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం, పొందూరు, జి.సిగడాం, ఆమదాలవలస, నరసన్నపేట, పోలాకి, జలుమూరు, గార, లావేరు మండల పరిధిలోని వారు ఈనెల 8వ తేదీన శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరు కావాలని కోరారు. ఎల్.ఎన్ పేట, కొత్తూరు, హిరమండలం, సరుబుజ్జిలి, బూర్జ మండల పరిధిలోని వారు ఎల్.ఎన్‌పేట ఎంపిడిఒ కార్యాలయం వెనుక గల భవిత కేంద్రంలో హాజరు కావాలని తెలిపారు. ఈనెల 9వ తేదీన కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, మందస మండలాల పరిధిలోని వారు కంచిలిలోని భవిత కేంద్రానికి, మిగిలిన మండలాల్లోని వారు టెక్కలిలోని భవిత కేంద్రానికి హాజరు కావాల్సి పేర్కొన్నారు. వైద్య పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులకు రవాణా ఛార్జీలు, భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ ఆధార్, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికేట్ జిరాక్స్ ప్రతులు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరు కావాలని తెలిపారు.

పట్టుబడిన మద్యం దొంగలు


- పది మంది అరెస్టు
- మరో ముగ్గురు కోసం గాలింపు
- 6,328 మద్యం సీసాలు స్వాధీనం
- ఎస్పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - లావేరు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పి రాధిక

మండలంలోని మురపాకలో గల ప్రభుత్వ మద్యం దుకాణంలో గత నెల 28న మద్యం దోపిడీకి పాల్పడిన నిందితుల్లో పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్పి జి.ఆర్ రాధిక వెల్లడించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని, వీరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. లావేరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మద్యం దోపిడీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మద్యానికి బానిసైన మండలంలోని కేశవరాయునిపాలెంకు చెందిన ప్రధాన నిందితుడు నాయన సతీష్‌తో పాటు మరో తొమ్మిది మంది ప్రభుత్వ మద్యం దుకాణాన్ని దోపిడీ చేయాలని నిర్ణయించారు. ఆ మద్యాన్ని విశాఖపట్నంలో విక్రయించి వచ్చే సొమ్ముతో జల్సాలు చేయాలని భావించారు. మద్యం తరలించేందుకని విశాఖపట్నం నుంచి తెచ్చిన వ్యానులో నవంబరు 28న అర్ధరాత్రి పది మంది వచ్చి మద్యం దుకాణానికి కొద్దిదూరంలో తోటలో వ్యాన్‌ను నిలిపారు. చాకులు, సమ్మెటతో దుకాణం వద్దకు వచ్చి వాచ్‌మెన్లను కత్తులతో బెదిరించి, కొట్టి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను లాక్కొన్నారు. వారి లుంగీలతోనే వారిని కట్టి, దుకాణం గోడకు కన్నం చేసి 7087 మద్యం సీసాలను వ్యానులో లోడ్ చేశారు. మరుసటి రోజు విశాఖ తరలించాలని భావించి కేశవరాయునిపాలెంలోని కొబ్బరి తోటల్లోని గడ్డివాముల్లో దాచిపెట్టి పరారయ్యారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

చోరీ అనంతరం పోలీసులు నాలుగు బృందాలుగా సిసి కెమెరాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా 24 గంటల్లోనే చోరీకి గురైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో బుడుమూరు కూడలిలో పది మంది నిందితులను అరెస్టు చేశారు. ఇందులో తొమ్మిది మంది స్థానికులు కాగా, వ్యాన్ డ్రైవర్ పాలవలస చంద్రరావు విశాఖపట్నంకు చెందిన వారు. ఈ ఘటనలో హస్తం ఉన్న విశాఖ పూర్ణామార్కెట్‌కు చెందిన మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. నిందితుల నుంచి ఆరు చాకులు, సమ్మెట, మోటార్ సైకిల్, వ్యాను, రెండు సెల్‌ఫోన్లు, రూ.10.29 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఎస్పి తెలిపారు. రెండు రోజుల్లో మద్యాన్ని రికవరీ, వారం రోజుల్లో నిందితులను పట్టుకున్న పోలీసులకు ఎస్పి రివార్డులను అందజేశారు. సమావేశంలో ఎఎస్పి టి.పి విఠలేశ్వర్, డిఎస్పి ఎం.మహేంద్ర, జె.ఆర్ పురం సిఐ స్వామినాయుడు, లావేరు, రణస్థలం, జి.సిగడాం, ఎచ్చెర్ల ఎస్ఐలు కోటేశ్వరరావు, జి.రాజేష్, చామంతుల రామారావు, సత్యనారాయణ తదితరులున్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హెచ్చరించారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై అవగాహనా ర్యాలీ (మారథాన్)ని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సూర్యమహల్ జంక్షన్ వరకు సాగింది. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించి లైంగిక వేధింపుల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై గత నెల 26 నుంచి ఈనెల పదో తేదీ వరకు పలు రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే పై అధికారులను సంప్రదించాలని సూచించారు. లైంగిక వేధింపులపై కలెక్టర్, ఎస్పి, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులను సంప్రదించవచ్చన్నారు. సమాజంలో లింగ వివక్షకు శాశ్వతంగా ముగింపు పలికాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలన్నారు. అనంతరం లైంగిక వేధింపుల నివారణపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఎస్పి టి.పి విఠలేశ్వర్, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖాధికారి కె.అనంతలక్ష్మి, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఇంటర్న్‌షిప్‌కు విద్యార్థుల కేటాయింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

డిగ్రీ విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కు తక్షణమే కేటాయించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌కు కేటాయింపుపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్.వెంకటరావుతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిజికల్‌గా, వర్చువల్‌గా 104 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నట్లు వివరించారు. మొదట రెండు నెలలు కమ్యూనిటీ సర్వీసు, మరో రెండు నెలలు ఇంటర్న్‌షిప్, ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ ఫేస్ ఉంటుందన్నారు. ఏ మండలంలో ఉన్న విద్యార్థులను ఆ మండలంలో వేయాలని తెలిపారు. శాఖల వారీగా ఎంతమంది విద్యార్థులను కేటాయించిందీ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని ప్రొసీడింగ్స్‌ను తక్షణమే జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా అటవీ శాఖ అధికారి జి.హారిక, యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్, డిపిఒ రవికుమార్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఎస్ఒ వెంకటరమణ, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పతాక నిధికి విరాళాలు ఇవ్వాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాయుధ దళాల పతాక నిధికి ప్రతిఒక్కరూ విరాళాలు అందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవంలో భాగంగా పతాక నిధికి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. పతాక నిధి ఫ్లాగ్‌ను జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైనిక దళాల దేశభక్తి, సాహసం, త్యాగాలపై దేశం గర్విస్తుందన్నారు. పాకిస్థాన్, చైనా యుద్ధ సమయాల్లో, కార్గిల్ యుద్ధంలో, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు జాతి యావత్తు గర్విస్తోందన్నారు. ఎంతోమంది సైనికులు దేశ రక్షణలో ప్రాణాలు అర్పించారన్నారు. వీర జవాన్లకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పతాక నిధికి అందించే విరాళాలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి, శ్రీకాకుళం వారి స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతా నంబరు 62064304822, ఐఎఫ్ఎస్‌సి కోడ్ SBIN 0020784కు గానీ... డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయవాడ పేరున చెక్కు లేదా డ్రాఫ్ట్ తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇఎఫ్ ఫెడరేషన్ గ్రూప్ కెప్టెన్ చైర్మన్ ఈశ్వరరావు, డిఇఎఫ్ ఫెడరేషన్ అధ్యక్షులు పూర్ణచంద్రరావు, ఎయిర్‌ఫోర్స్ అధికారి రమణమూర్తి, నేవీ హవల్దార్ మురళీధరరావు, ఆర్మీ సూపరింటెండెంట్ ఈశ్వరరావు, ఎన్‌సిసి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పతాక నిధికి విరాళాన్ని అందిస్తున్న కలెక్టర్

అశ్రునయనాలతో రామశేషు అంత్యక్రియలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



నివాళ్లర్పిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార మండలం దువ్వుపేటలో దారుణ హత్యకు గురైన వైస్ ఎంపిపి బరాటం రామశేషు మృతదేహానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. అభిమానులు, బంధువులతో పాటు శ్రీకాకుళం నగరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరై రామశేషు మృతదేహానికి నివాళ్లర్పించారు. రామశేషు భార్య జయలక్ష్మి, తండ్రి నాగేశ్వరరావు, కుటుంబసభ్యులను ఓదార్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు. రామశేషు మృతికి సంతాప సూచకంగా శ్రీకూర్మంలో వ్యాపారులు బుధవారం స్వచ్ఛందంగా బంద్ పాటించి సంఘీభావం తెలిపారు. అంతిమయాత్రలో వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, గార ఎంపిపి గొండు రఘురాం, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను, వైసిపి నాయకులు పైడి నాగేశ్వరరావు, అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ స్టోర్ ప్రారంభం


ఆర్గానిక్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం: జిల్లాలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకాన్ని క్రమంగా తగ్గించి, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ అన్నారు. నగరంలోని రైతుబజారు ప్రాంగణంలో న్యూ ఆర్గానిక్ స్టోర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం వల్ల ప్రమాదంలో పడ్డామని అందరూ తెలుసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ ప్రమాదం నుంచి బయట పడాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో మొదలైందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంపై రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. అనంతరం సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సూర్య తాతబాబు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు శైలానాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లల కేసులకు న్యాయ సహాయం


మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం: తప్పిపోయిన పిల్లల కేసులకు న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం న్యాయసేవా సదన్‌లో పారాలీగల్ వాలంటీర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పిపోయిన పిల్లల కేసుల్లో ఆ పిల్లల తల్లిదండ్రులు, బంధువులకు న్యాయ సహాయం అందించేందుకు ఎంపిక చేసిన పోలీస్‌స్టేషన్లలో పారాలీగల్ వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. తప్పిపోయిన పిల్లల కేసుల విషయంలో పారా లీగల్ వాలంటీర్లు న్యాయ సహాయం అందిస్తారని చెప్పారు.

జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న జోగినాయుడు

శ్రీకాకుళం: రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ఇతోధికంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం విజ్ఞప్తి చేశారు. సిఎస్‌గా బాధ్యతలు చేపట్టిన జవహర్‌రెడ్డిని ఎపిజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు బుధవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జర్నలిస్టుల సమస్యలను సిఎస్‌కు వివరించి వినతిపత్రం అందజేశారు.రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులతో పాటు బస్సు, రైల్వేల్లో ప్రయాణించే సమయంలో రాయితీ కల్పించాలని, అర్హులైన జర్నలిస్టులకు సొసైటీలతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. డివిజన్ పిఆర్‌ఒ కార్యాలయాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల తరహాలో 50 ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు నెలకు రూ.మూడు వేలు పింఛను ఇప్పించాలని కోరారు. ప్రెస్ అకాడమీ తరుపున ఏటా ప్రతి డివిజన్ కేంద్రంలో వారం రోజులకు తగ్గకుండా శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. ప్రెస్‌అకాడమీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

టెక్కలి ఎస్‌ఐగా రామకృష్ణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

టెక్కలి రూరల్: టెక్కలి ఎస్‌ఐగా ఎల్.రామకృష్ణ నియమితులయ్యారు. అనకాపల్లి టౌన్ ఎస్‌ఐగా ఉన్న ఈయన బదిలీపై టెక్కలి వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన హరికృష్ణ విఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని రకాలు చర్యలూ చేపడతానని అన్నారు. టెక్కలిలో ఇటీవల జరిగిన దొంగతనాలపై ఆయన స్పందించి ప్రధాన కూడళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచుతామన్నారు. ట్రాఫిక్‌పై దృష్టి పెడతామన్నారు.

సంక్షిప్త వార్తలు

డంపింగ్ యార్డు నిర్మాణం అడ్డగింత


డంపింగ్ యార్డు పనులను అడ్డుకున్న ప్రజలు

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని దల్లవలస గ్రామంలో దళిత కాలనీ పక్కన డంపింగ్ యార్డు నిర్మించొద్దని కాలనీ వాసులు నిర్మాణ పనులను బుధవారం అడ్డుకున్నారు. ఇళ్లకు సమీపంలో డంపింగ్ యార్డు వల్ల నిత్యం దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడతామని, వ్యాధులు వచ్చే అవకాశముందని తెలిపారు. ఈ నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ పలుమార్లు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు నివేదించినప్పటికీ నిర్మాణ పనులను జరుపుతుండడంతో కాలనీ వాసులంతా కలిసి పనులను అడ్డుకున్నారు. ఈ వీధికి అనుకొని డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేసి జనవాసానికి ఒక కిలోమీటరు దూరంలో నిర్మాణం చేయాలన్న పంచాయతీరాజ్‌ఉత్తర్వులకు అనుగుంగా నిర్మాణాన్ని నిలిపి వేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులుబి.ప్రభాకర్, ఎస్‌వి.జగన్నాతం, రాకోటి రాంబాబు, నల్లబారికి గురుమూర్తి డిమాండ్ చేశారు. తక్షణమే పనులు నిలుపుదల చేయకపోతే ప్రత్యక్ష చర్యలకు దిగుతామని కాలనీవాసులు రాము, లక్ష్మి, రామారావు, జీవం, కళావతి అన్నారు.

ఎంఇఒకు సన్మానం


ఎంఇఒను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: ఎంఇఒగా విధులు నిర్వహించి, సొంత మండలానికి బదిలీపై వెళ్లిన సవర దేవేంద్రరావును మండలంలోని ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రస్తుత ఎంఇఒ దాసరి నాగభూషణరావు దేవేంద్రరావును శాలువ కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా దేవేంద్రరావు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులు సమిష్టి కృషి ప్రశంసనీయమని అన్నారు. విధి నిర్వహణలో వారు చూపిన చొరవ గొప్పదన్నారు. ఎంఇఒగా విధులు నిర్వర్తించిన దేవేంద్రరావు సేవలను పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ఎంఇఒ డి.నాగభూషణరావు, ఉపాధ్యాయులు ధనుంజయరెడ్డి, ఎస్.మోహనరావు, వజ్జ ఆదినారాయణ, కృష్ణారావు, మారం కుమారస్వామి, టి.ధర్మారావు, ఆర్‌వి.రమేష్‌కుమార్, వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కోటబొమ్మాళి: గార వైస్ ఎంపిపి బరాటం రామశేషును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రామశేషు ఎదుగుదలను చూడలేకే ప్రత్యర్థులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని అన్నారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు బోయిన కృష్ణారావు, తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు మాతృ వియోగం

ప్రజాశక్తి - పలాస

మండలంలోని చిన్న నీలావతి గ్రామానికి చెందిన నీలావతి మాజీ సర్పంచ్ పుచ్చ భాస్కరరావు తల్లి పుచ్చ అప్పిలమ్మ(80) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు అబ్బాయిలు, నలుగురు అమ్మాయిలు ఉన్నారు. అందులో పుచ్చ భాస్కరరావు నీలావతి పంచాయతీ సర్పంచ్‌గా పనిచేయగా, మరో కుమార్తె బత్తిన రూపావతి గురుదాస్‌పురం ఎంపిటిసిగా పని చేశారు. ఆమె అల్లుడు బత్తిన హేమేశ్వరరావు పలాస ఎంపిపిగా ఉన్నారు. అప్పిలమ్మ మృతికి ఆయా పార్టీల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

30 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న సునీల్‌కుమార్

బూర్జ: మండలంలోని కొల్లివలస జంక్షన్‌లో జెమ్స్ ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సునీల్‌కుమార్ 30 మందికి వైద్యసేవలు అందించారు. వారిలో పది మందిని జెమ్స్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో స్వాఇ ఆస్పటల్ డాక్టర్ నారంనాయుడు, పి.రాజేశ్వరరావు, ఎల్.శ్రీధర్, ధనుంజయ్, పిఆర్‌ఒ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి



పలాస: నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - పలాస

జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మున్సిపాలిటీలోని 5వ వార్డు తాళ్లభద్ర, ఉప్పరపేట, నీలాపురం గ్రామంలో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలపై పెనుభారం వేస్తోంది, రానున్న ఎన్నికల్లో జగన్‌ను గద్దె దించకపోతే రాష్ట్రం మరింత నాశనమవుతంఉదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ప్రజల ఇళ్లకు వెళ్లి వారి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వజ్జ బాబురావు, మున్సిపాలిటీ అధ్యక్షులు బిడ్డ నాగరాజు, సప్ప నవిన్, లోడగల కామేష్, గాలి కృష్ణ, గురిటి సూర్యనారాయణ, అంబటి కృష్ణమూర్తి, రవిశంకర్ గుప్తా, శంకర్, పాండు రంగారావు, సురేష్, నాబెల్లి శ్రీ నువాస్, జోగమల్లి ఆత్మారావు, కుమ్మరి శివాజీ, చిన్న, పాలిన సూర్యనారాయణ, దట్టి సురేష్, బద్రి శంకర్, శాలిని వెంకట్, లావేటి శ్రీను, చింతల సూర్యనారాయణ, శాలిని ధనరాజ్, పిట్ట రాము, తదితరులు పాల్గొన్నారు

మండలంలోని మరదరాజపురం గ్రామంలో టిడిపి నాయకులు విఠల్ ఆధ్వర్యాన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మణ కుమార్, ప్రధాన కార్యదర్శి సంతోష్, తదిదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని బూర్జపాడు పంచాయతీ డొంకూరులో టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపిపి ఢిల్లీరావు ఆధ్వర్యాన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాడి సహదేవు, లోపింటి పద్మనాభం, దక్కత కామేశ్వరరావు, శేఖర్, శంకర నారాయణ, లోకానాథం, ఎ.ఈశ్వరావు, బి.ప్రసాద్‌రెడ్డి, వి.ధర్మరాజు, పి.చంద్రశేఖర్, పైల రుక్మాంగధరరెడ్డి, పి.వాసు, యు.సత్యనారాయణ, పి.బాబ్జి, పి.దుర్యోధనరెడ్డి, ఎ.రామకృష్ణ, ఐటిడిపి అధ్యక్షులు నరేంద్ర, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: జగన్మోహన్‌రెడ్డి ప్రజలపై భారాలు మోపి, బాదేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహన్‌రావు, తెలుగు యువత ఉపాధ్యక్షులు బి.శశిభూషణ్ అన్నారు. బుధవారం పెద్దబొడ్డపాడు, సీతాపురంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినాన గోపాలరావు, టి.రంగారావు, మరడ దుర్యోధన, బి.జగదీష్, ఎం.తాతయ్య, వజ్జల, హనుమంతు గిరిధర్, కృష్ణారావు, ఎ.ఉమామహేశ్వరరావు, వంక రామారావు, దాశరథి, మార్కండే, తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కలమట వెంకటరమణ

కంచిలి: మండలంలోని కుత్తుమ గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా టిడిపి మండల నాయకులు కామేష్‌రెడ్డి, బంగారు కురయ్య, మద్దిల ఆనందరావు తదితరులు ర్యాలీ చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ మూడున్నర ఏళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేక పాలన గురించి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు తమలాల శ్రీశ్, జగదీష్ పట్నాయక్, సర్పంచ్ ప్రతినిధి సనపల కామేశ్వరరావు, మద్దిల నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: పాలనలో వైసిపి విఫలమైందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. బుధవారం కడుమ కాలనీలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను, అసమర్థ పాలనను వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి వి.గోవిందరావు, కె.వెంకటరావు, మతాల గాంధీ, వెంకటరమణమూర్తి, గోవిందరావు, సర్పంచ్ నెల్లి అచ్చుత, శ్రీనుబాబు, జమ్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


మాట్లాడుతున్న గిరిజా శంకర్

ప్రజాశక్తి - ఆమదాలవలస/ సరుబుజ్జిలి

సైబర్ నేరగాళ్లపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ కె.గిరిజాశంకర్ అన్నారు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురంలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్‌ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పలానా బ్యాంకు నుండి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్లు చేసి బ్యాంక్ అకౌంటు వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంల వద్ద అపరిచితులకు డబ్బులు విత్ డ్రాచేయాలని కార్డులు ఇవ్వకూడదని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం రూ.12తోనే రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. 18 ఏళ్లు దాటిన వ్యక్తుల నుండి 70ఏళ్ల వారికి ఇది వర్తిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం రూ.330లకే రూ.2 లక్షల రూపాయల జీవిత బీమా లభిస్తుందని తెలిపారు. 18ఏళ్ల నుంచి 50ఏళ్ల వారికి ఇది వర్తిస్తుందని తెలిపారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరితే అతి తక్కువ పెట్టుబడితో వృద్ధాప్యంలో అధిక ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. ఎటిఎం కార్డుల వెనుక పిన్ నెంబర్‌ను రాయవద్దని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కె.మధు గణేష్, జి.మానస, సిఎఫ్ఎల్ సిబ్బంది చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎస్‌పి జి.రాధిక


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి పలాస

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్‌పి రాధిక పోలీసులను ఆదేశించారు. కాశీబుగ్గ రూరల్ సర్కిల్ పోలీసు స్టేషన్‌ను బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాశీబుగ్గ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి, పలు ముఖ్యమైన రికార్డుల నిర్వహణపై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ గ్రామంలో పోలీస్ సిబ్బంది సందర్శించాలని, గస్తీ నిర్వహణ పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అదే విధంగా రోడ్డు భద్రత, నియమాలపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ తనిఖీలో కాశీబుగ్గ సబ్ డివిజన్ డిఎస్‌పి ఎం.శివరామిరెడ్డి, సర్కిల్ సిఐ జి.శంకరరావు ఉన్నారు.

మూడు ఇసుక లారీలు పట్టివేత


ఇసుక లారీలతో ఎస్‌ఇబి అధికారులు

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు ఎస్‌ఇబి పరిధిలోని జి.సిగడాం మండలం సర్వేశ్వరపురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను బుధవారం పట్టుకున్నట్లు సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు వాహనాల తనిఖీలు చేస్తుండగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను పట్టుకుని, స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఇబి ఎస్ఐ మురళి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరి మాగాణిలో మొక్కజొన్న


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-రణస్థలం

వరి మాగాణుల్లో దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు చేపట్టడం వల్ల మేలైన దిగుబడులు సాధించవచ్చని ఆమదాలవలస ఏరువాక కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త జి.చిట్టిబాబు అన్నారు. బుధవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరువాక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రణస్థలం మండలం వరాహనరసింహపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సీడ్ డ్రిల్ యంత్రంతో నేరుగా మొక్కజొన్న సాగు క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వరి కోతల అనంతరం పొలంలో ఉన్న తేమలో నేరుగా మొక్కజొన్న విత్తనాలు నాటడం వల్ల 100 శాతం మొలకెత్తే అవకాశంతో పాటు సుమారు 20 రోజుల వరకు నీటి తడులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. దీని వల్ల రెండు తడుల నీరు ఆదా అవడమే కాకుండా, పొలం దుక్కి చేయాల్సిన అవసరం ఉండదు కాబట్టి దుక్కి ఖర్చులు, విత్తనాలు నాటే కూలి ఖర్చులు ఆదా అవుతాయని అన్నారు. విత్తిన 48 గంటలలోపు తొలి దశలో కలుపు నివారణకు ఎకరాకు ఒక కిలో అట్రాజిన్ 50శాతం పొడి మందును, వరి దుబ్బులు చిగురు వేయకుండా 1లీటరు పారాక్వాట్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పొలం అంతా తడిచేలా పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

వరి మాగాణీల్లో దుక్కి దున్నకుండా విత్తనం మరియు ఎరువు ఒకేసారి వేసే సీడ్ డ్రిల్ యంత్రంతో నేరుగా మొక్కజొన్న విత్తనాలు నాటడం వల్ల కేవలం ఒక గంట వ్యవధిలో 5 సమాన వరుసల్లో విత్తడం పూర్తవుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. ఈ యంత్రంతో విత్తనాలు వేయడం వల్ల వరుసల మధ్య 60 సెం.మీ.లు మరియు విత్తనాల మధ్య 20 సెంటీమీటర్ల దూరం ఉండటం వల్ల గాలి, వెలుతురు బాగా సోకి పురుగులు, తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉంటుందని రైతులకు సూచించారు. ఇప్పటివరకూ ఈ యంత్రాలతో రణస్థలం, లావేరు మండలాల్లో సుమారు 250 ఎకరాల్లో మొక్కజొన్న విత్తనాలు నేరుగా విత్తే విధానంపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం రైతు మిత్ర రెడ్డి గోవిందకు చెందిన పొలంలో వరి కోత అనంతరం సీడ్ డ్రిల్ యంత్రంతో నేరుగా మొక్కజొన్న విత్తనాలు నాటే విధానంపై క్షేత్ర స్థాయిలో చేసి చూపించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ బి.పద్మి రామ్, కె.హామిక, ప్రోగ్రామ్ అసోసియేట్ సిమ్రన్ ఠాకూర్, సమన్వయ కర్తలు బి.లక్ష్మీ నరసింహమూర్తి, పి.తవిటినాయుడు, నారాయణరావు, గణేష్, కృష్ణ, గోపాల్; తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న సిఐ పైడయ్య

ప్రజాశక్తి - ఆమదాలవలస

విధిగా రహదారి నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సిఐ పి.పైడయ్య అన్నారు. బుధవారం రైల్వే స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని అన్నారు. నియమ, నిబంధనలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే రహదారి ప్రమాదాలను నివారించగలమని అన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రత ప్రతిక్షణం, నిమిషం ప్రతి రోజూ అవసరమని, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని డ్రైవర్లకు సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపరాదని, వాహనంలో ఎక్కువ శబ్దంతో ఆడియో రికార్డులు ఉపయోగించరాదని అన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్‌లో మాట్లాడ వద్దని, వాహనం మలుపు తిరిగేటప్పుడు తప్పనిసరిగా సిగ్నల్ ఇవ్వాలని డ్రైవర్లకు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఎస్ఐ వై.కృష్ణ , ఎఎస్ఐ శ్రీనివాసరావు, సచివాలయ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

నౌపడలో మట్టి అక్రమ తవ్వకాలు


జెసిబితో తవ్వుతున్న మట్టి

ప్రజాశక్తి -నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ మేజర్ పంచాయతీలో అక్రమార్కులు చెరువులో మట్టినీ వదలడం లేదు. నౌపడలోని సర్వే నెంబర్ 482లో ప్రభుత్వ భూమిలో ఉన్న దాకాబంధ చెరువు గట్టును తవ్వి కొందరు ట్రాక్టర్లతో తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులో గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా లక్షలాది రూపాయలు వెచ్చించి గట్లు వేశారు. వేసిన గట్లు నామరూపాలు లేకుండా తవ్వేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే అది రైతులకు సంబంధించిన చెరువని, వారి అభిప్రాయం మేరకే మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఎదురు దాడి చేస్తున్నారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్ పలుమార్లు హెచ్చరించినా అదేమీ పట్టనట్టు తవ్వకాలు సాగిస్తున్నారని ఆయన వాపోయారు. దీనిపై తహశీల్దార్ చలమయ్య మాట్లాడుతూ పరిశీలించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక విఆరఒ ప్రసాద్ చెరువును పరిశీలించి, కేసు నమోదు చేస్తామని తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



భోజన పథకం అమలు తీరును పరిశీలిస్తున్న ఎపిఎం ప్రసాదరావు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని బూర్జపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, నాడు-నేడు పనులను వెలుగు ఎపిఎం ప్రసాదరావు పరిశీలించారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో మెనూ మార్పు, ఏ విధంగా పాఠశాల నిర్వహిస్తున్నారు, పిల్లలందరికీ సకాలంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా, నీటి సదుపాయం, పిల్లలు భోజనం చేసే పరిసరాల పరిశుభ్రత ఏలా ఉందో పరిశీలించారు. నాడు-నేడు ద్వారా మంజూరైన నిధులు ఏ మేరకు ఖర్చు జరుగుతున్నాయి, నిర్మాణ పనులు ఏ స్థితిలో ఉన్నాయి, పాఠశాల పేరెంట్స్ కమిటీ సక్రమంగా మీటింగ్స్‌కు హాజరవుతూ, బాధ్యతలు తీసుకుంటున్నారా లేదా, బడి మానేసిన పిల్లలను మళ్లీ స్కూల్‌కి తేవడానికి కార్యాచరణ, టోల్ ఫ్రీ నంబర్స్ తదితరులు విషయాలు పరిశీలించారు. ఆయనతో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఈచ్ఎం గంగయ్య, ప్రసాదరావు పాల్గొన్నారు.

సొసైటీ స్థలాన్ని అప్పగించాలి

ప్రజాశక్తి - టెక్కలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం పక్కనున్న జగద్ధాత్రి స్వర్ణకారలు సొసైటీ స్థలాన్ని తమకే అప్పగించాలని కోరుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్వర్ణకారులు బుధవారం నిరసన తెలిపారు. సొసైటీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, ఆక్రమిత దారులు మంగళవారం చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో లక్కోజు శంకరరావు, గాడి వినాయకరావు, ఎల్.కేశవరావు, పద్మనాభవం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

సోంపేట: మండలంలోని మాకన్నపురం పంచాయతీ శారదాపురంలో సిసి రోడ్డు పనులను సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి కె.ఆనందరావు, నాయకులు జోగారావు, యాదవరావు, బి.చంద్రయ్య, టి.లోకనాథం, కె.మాధవరావు, బి.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

ప్రజాశక్తి - కవిటి

గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కార్యదర్శులకు ఎంపిడిఒ పైలా సూర్యనారాయణ సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సాయంత్రం ఎంపిడిఒ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు - అభివృద్ధి ప్రణాళికలు అనే అంశంపై డిసెంబర్ 9, 12, 13 తేదీల్లో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో సిద్ధం కావాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శివాజీ పానిగ్రాహి, ఇఒ వీరభద్ర స్వామి, పంచాయతీ కార్యదర్శులు మన్మథరావు, ఖాన్ అబ్దుల్, గుణవతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'ఎంజిఆర్'


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంజిఆర్ యువసేన సభ్యులు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని రాజపురం, నందలపాడు, జన్నిబంధ, సజ్జినా పురం, కాపు సజ్జినాపురం, సిడి పాలెం, మారేడుకోట, పోలూరు, సవర పోలూరు, నాయుడు పోలూరు, తదితర గ్రామాల్లో ఎంజిఆర్ యువసేన ఆధ్వర్యంలో ఇంటింటికీ ఎంజిఆర్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మామిడి గోవిందరావు చేస్తున్న సేవా కార్యక్రమాలపై గ్రామస్తులకు తెలియజేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, యువసేన సభ్యులు శేఖర్, భీమారావు, భాస్కరరావు, రామరాజు, బాలకృష్ణ, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యాన జంగిల్ క్లియరెన్స్


జంగిల్ క్లియరెన్స్ పనులను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

సోంపేట: కొర్లం-బారువ రహదారిలో బుధవారం ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టడమే కాకుండా ప్రమాదకరమైన మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు.

రుణాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న విద్యాసాగర్

టెక్కలి రూరల్: మహిళలకు బ్యాంకు లింకేజ్ ద్వారా ఇచ్చిన రుణాలు సద్వినియోగమయ్యేలా చర్యలు చేపట్టాలని డిఆర్‌డిఎ పీడీ వి.విద్యాసాగర్ అన్నారు. బుధవారం టెక్కలి మండల మహిళా సమాఖ్యలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, సారవకోట ఎపిఎంలు, సిసిలు, ఎసిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టే కార్యక్రమాల లక్ష్యాలు ఎంత మేరకు సాధించారో అడిగి తెలుసుకున్నారు. ఇంకా చేయాల్సిన పనులపై సమీక్షించారు. సంఘం సభ్యులు జీవనోపాధుల నిమిత్తం ఇచ్చిన రుణాలు సద్వినియోగం, పెరటి కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం, ఆవులు, గేదెల యూనిట్లకు సంబంధించి రివ్యూ చేశారు. స్త్రీ నిధి సామాజిక పెట్టుబడి బ్యాంకు లింకేజీ లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, ఎపిఎంలు జి.నారాయణరావు, సూర్యనారాయణ, గోవిందరాజులు, శ్రీనివాస్ బాబా, సిసిలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలోని రత్తకన్న అంగన్వాడీ కేంద్రాన్ని వైఎస్ఆర్ పోషణ, బాల అమృతం అమలుతీరుపై వార్డు కౌన్సిలరు తాడి ఆదిరెడ్డి బుధవారం పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషక పదార్థాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. రికార్డులు పరిశీలించారు.

సచివాలయం తనిఖీ

మెళియాపుట్టి: మండలంలో పెద్ద పద్మాపురం సచివాలయాన్ని తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ చంద్రకుమారి బుధవారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, ధాన్యం కొనుగోలు, ఎస్‌డిజి సర్వే, సిఆర్ యాప్, సచివాలయాల ద్వారా అందుతున్న సేవలు, ఆయుష్మాన్ భారత్, తదితర అంశాలపై పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని, లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ దానకర్ణుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ సెమిస్టర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ రోబిన్‌కుమార్ పాడి, అధ్యాపక బృందం అభినందించారు. ఫస్ట్ సెమిస్టర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన గుడియ జ్యోతి ఎంపిసిలో 9.64 సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. పనపాన పూజా 8.24, బెహరా కుసుమ 8.08, బిఎలో కె.సోనియా 8.36, లిమ్మయ్ స్నేహ 8.09, ఎన్.సోనియా 7.06, బికాంలో సుచిత్ర పండా 7.79 సాధించిన విద్యార్థులకు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం రామకృష్ణ జెన్న, సంతోష్ కుమార్, గణపతి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



కవిటి: సోంపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు బుధవారం అత్యవసరంగా రక్తం అవసరమైంది. వాట్సాప్ ద్వారా సమాచారం అందుకున్న సురేష్ వెంటనే స్పందించి రక్తం అందించాడు. దీంతో మహిళకు ప్రమాదం తప్పింది. కవిటి మండలం కళింగపట్నం గ్రామానికి చెందిన సురేష్ ఇప్పటివరకు 11 సార్లు రక్తదానం చేసి అభాగ్యులకు అండగా నిలిచాడు. ఇప్పుడు 12వ సారి రక్తదానం చేసి ఒ మహిళ ప్రాణాలు కాపాడాడు. దీంతో సురేష్‌ను పలువురు అభినందించారు.



భాస్కరరావును సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణులు

సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంతో పోరాడుతానని రాష్ట్ర నాయీబ్రాహ్మణ సవిత సమాజం ఉపాధ్యక్షులు పట్నాన భాస్కరరావు అన్నారు. ఈయన రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఆయనను మండల నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి నాయీబ్రాహ్మణులు ఎక్కడ ఉన్నారో తెలియడం లేదన్నారు. కార్యక్రమంలో బొమ్మాళి కృష్ణారావు, రామదాసు, టి.శంకరరావు, హరికృష్ణ, సిహెచ్ శివ, తదితరులు పాల్గొన్నారు.

బీజామృతం తయారీపై అవగాహన

కంచిలి: మండలంలోని గోకర్ణపురం పంచాయతీ జె.నారాయణపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ డివిజనల్ యాంకర్ యశోద ఆధ్వర్యంలో రైతులకు బీజామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 లీటర్ల నీరు, 10 కిలోల పేడ, 10 లీటర్ల ఆవు మాత్రంతో ఈ బీజామృతాన్ని ఎలా తయారు చేసుకోవచ్చో తెలియజేశారు. బీజామృతాన్ని విత్తన శుద్ధికి ఉపయోగిస్తే మొలక శాతం పెరగడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి చిట్టిబాబు, ఐబి రేవతి, రైతులు పాల్గొన్నారు.



ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ



ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి దుప్పల రామారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో వికలాంగ విద్యార్థులకు చేస్తున్న ఫిజియోథెరపీ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలు, వికలాంగులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని అన్నారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ లాడి అలీషా మాట్లాడుతూ ఫిజియోథెరపీ అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు పిల్లలతో చిన్నచిన్న ఎక్సర్ సైజ్‌లను చేయించాలని సూచించారు. ఫిజియోథెరపీ ద్వారా క్రమం తప్పకుండా పనిచేయనిఅవయవాలతో వ్యాయామం చేయిస్తూ ఉంటే తిరిగి యథా స్థానానికి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు పూజారి శ్రీధర్, ఎస్.గోవిందరావు, ఎంఐఎస్ రమణ, సిఆర్‌పిలు శ్రీనివాస్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలోనే ప్రజలందరికీ అర్థమయ్యేలా చెప్పాలని వైసిపి యువజన ప్రధాన కార్యదర్శి కంది నాని అన్నారు. పెంట గ్రామంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించిన ఘటన సిఎందేనని అన్నారు. సమావేశంలో సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపిటిసి ఎం.శ్రీనివాస్, వైసిపి మండల నాయకులు జి.నారాయణరావు, మీసాల శ్రీనివాస్, పున్నాన అక్కలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాని

రక్త గ్రూపు నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి -పొందూరు

మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్త గ్రూప్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని 370 మంది విద్యార్థులకు రక్త గ్రూపును నిర్ధారించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సునీత, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ రమణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కింతలిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న రక్త పరీక్షలు

నేత్ర వైద్యాధికారికి సన్మానం

పలాస: వైఎస్ఆర్ కంటి వెలుగు పలాస మండల ప్రభుత్వ నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణకు హిమాలయాస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా పలాస ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం రాత్రి సన్మానం చేశారు. మొక్కను బహుకరించారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ పలాస అధ్యక్షులు గోనిల గోపాలరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బత్తిని ఓంకార్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆస్థాన మధుబాబు, మేలాపు ఉపేందర్‌రెడ్డి, కృష్ణారావు, సుందర్, శంకర్ పాల్గొన్నారు.



వైద్యాధికారి వెంకటరమణను సన్మానిస్తున్న సిబ్బంది



బయోమెట్రిక్‌ను పరిశీలిస్తున్న ఐకెపి ఎపిఎం

బయోమెట్రిక్ తప్పనిసరి

బూర్జ: మండలంలోని డ్వాక్రా మహిళా సంఘాలకు బయోమెట్రిక్ తప్పనిసరి అని ఎపిఎం బి.రాము తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా మూడో విడత రుణమాఫీ డబ్బులు నేరుగా సభ్యుల ఖాతాలోకి జమ కావాల్సి ఉందని, ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి అని తెలిపారు. ఈ నెల 10వ తేదీలోపు బయోమెట్రిక్‌ను విఒలు నేరుగా సంఘాల వద్దకు వచ్చి బయోమెట్రిక్ వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అనితనాయుడు, డ్వాక్రా సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో చెరువులకు రక్షణ కవచాలు

పొందూరు: మేజరు పంచాయతీ పరిధిలో ప్రమాదాలు జరుగకుండా మూడు చెరువులకు రక్షణ కవచాలు నిర్మాణానికి పంచాయతీ కార్యవర్గం నిర్ణయించింది. సర్పంచ్ రేగడి లక్ష్మీ ఆధ్యక్షతన బుధవారం పంచాయతీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. చెరువులలో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రమాదవసాత్తు మృతి చెందిన నేపథ్యంలో ప్రమాదాలు జరుగుకుండా రక్షన కవచాలు ఏర్పాటు చేసేందుకు నిధులు విడుదలకు తీర్మాణం చేసారు. అయితే పంచాయతీలో ఉన్న గ్రూపు వివాదాలు కారణంగా కొంతమంది వార్డుసభ్యులు గైర్హాజరయ్యారు. సమావేశంలో ఇఒ జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - టెక్కలి

విజయవాడలోని జయహో బిసి మహాసభకు నాయకులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను వేశారు. దీంతో ప్రయాణికులు గమ్య స్థానానికి వెళ్లేందుకు బస్సుల్లేక అవస్థలు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం కూడా బస్సుల్లే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఒక పక్క మార్గశిర మాసం కావడంతో గృహ ప్రవేశాలు, వివాహలు, శుభకార్యాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు రాకపోకలకోసం బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణీకులు పలు ఆవస్దలను ఎదుర్కొన్నారు. పలు ప్రభుత్వ పాఠశాల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు, ఉద్యోగులు జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో నిర్ణీత సమయానికి బస్సులు లేకపోవడంతో వారు పలు ఆవస్థలు పడ్డారు.



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆర్‌బికె పరిశీలన

ప్రజాశక్తి -సోంపేట

మండలంలోని బుషాభద్ర గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆర్‌డిఒ సీతారామ్మూర్తి, తహశీల్దార్ సురేష్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంగా రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. సిబ్బంది అన్ని వేళలా రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోలు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. రైతులు స్థానికంగా ఉండే రైతు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ నరసింహమూర్తి, కార్యాలయ సిబ్బంది జగన్, భార్గవి, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌బికెను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

వి.ఆర్ గూడెంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని వి.ఆర్.గూడెం గ్రామంలో బుదవారం విద్యుదీకరణ పనులు చేపట్టారు. సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు, ఉప సర్పంచ్ సువ్వారి గోవిందరావు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వీధుల్లో నూతన స్థంబాలను వేసి వీధిదీపాలను ఏర్పాటు చేశారు. పంచాయతీ నిధులతో గ్రామంలోని పలు విధుల్లో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.



ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు